
ఆదివారం కథ



బొమ్మలు: అక్బర్

# నాగరికథ

★ అనిల్ ఎస్. రాయల్

**"మీ దగ్గరో టైమ్ మెషీన్ ఉంది. దాన్లో మీరు కాలంలో డెబ్బయ్యేళ్లు వెనక్కెళ్లి మీ తాతగారు చిన్నపిల్లాడిగా ఉన్నప్పుడే ఆయన్ని చంపేశారనుకుందాం. మీ తాతగారికి అప్పటికి పెళ్లే అవలేదు కాబట్టి మీ నాన్నగారు పుట్టే అవకాశం లేదు. అంటే మీరు పుట్టే అవకాశమూ లేదన్నమాట. అప్పుడు మీరు కాలంలో వెనక్కెళ్లి మీ తాతగారిని చంపేసే అవకాశమూ లేదు. అంటే మీ తాతగారూ బతికే ఉంటారు. మీ నాన్నగారూ ఉంటారు. మీరూ ఉంటారు. అప్పుడు మళ్లీ మీరు కాల ప్రయాణం చేసి, మీ తాతగార్ని చంపేసే అవకాశమూ ఉంది. అంటే..."**

పాఠం ఆపి ఓ సారి క్లాసంతా కలయజూశాను. తెల్లముఖాలు కొన్ని, వెలుగుతున్నవి ఇంకొన్ని. క్వశ్చన్ మార్క్ ముఖాలు మరికొన్ని.

బి.ఎ.ఆర్.సి.లో అణుశాస్త్రవేత్తగా తీరిక లేని ఉద్యోగంలో ఉన్నా, ఏదోలా వీలు చూసుకుని నెలకోసారన్నా హైస్కూల్ విద్యార్థులకు గెస్ట్ లెక్చర్లివ్వటం నాకలవాటు. అదే పనిలో ఉన్నానిప్పుడు. ఇలాంటి చిన్న చిన్న విశేషాలూ, గమ్మత్తులే సైన్సు పట్ల పిల్లలకి ఆసక్తి పెంచుతాయన్నది నా స్వీయానుభవం.

అర్థమయినా కాకపోయినా అందరి ముఖాల్లోనూ ఆసక్తి కనిపించటంతో లెక్చర్ కొనసాగించాను. "...ఇది తెగేది కాదు. ఇన్ఫినెట్ లూప్ అన్నమాట. దీన్నే గ్రాండ్ ఫాదర్ పారడాక్స్ అంటారు. టైమ్‌ట్రావెల్‌లో ఎదురయ్యే ఇలాంటి తిరకాసులు మరికొన్ని ఉన్నాయి. ఉదాహరణకు..."

సెల్‌ఫోన్ మోగటంతో పాఠం ఆగింది. తాతయ్య గురించిన వార్త.

★★★

విమానంలో ఉన్న రెండుగంటలూ తాతయ్య జ్ఞాపకాలే. జీవితంలో ఏవీ యాదృచ్ఛికంగా జరగవనే వాడాయన. 'దెరార్ నో ... కో – ఇన్సిడెన్సెస్ మన వడా. ఓన్లీ ఛాయిసెస్ – బి అవర్స్, ఆర్ అదర్స్' అనేవాడు ఆంధ్రాంగ్లాలు కలగలిపేసి. గ్రాండ్ ఫాదర్ పారడాక్స్ మాట్లాడేటప్పుడే ఆయన గురించిన కబురు తెలియటం – నా ఛాయిస్ మాత్రం కాదు. దేవుడిదేమో!

తాతయ్య గుర్తొచ్చినప్పుడు ఆయన చెప్పిన కథలూ గుర్తొస్తాయి. కొన్ని నిజాలు నమ్మటం కష్టం. తాతయ్య కథలూ అంతే. అవన్నీ నిజాలే అనేవాడాయన. అర్థం అయ్యీ కాకుండా ఉండేవవి. వినేంతసేపూ, విన్నాకా నా బుర్రలో ఎన్నో ప్రశ్నలు. నాకు ప్రతిదాన్నీ ప్రశ్నించడం నేర్పింది తాతయ్యే. ప్రశ్నించే గుణమే లేకుంటే మనమింకా ఆదిమానవులుగానే మిగిలిపోయుండేవాళ్లం. "ప్రశ్నే ప్రగతికి తొలిమెట్టు" అనేవాడు.

'తాతయ్య' అంటున్నానని ఆయనేదో పురాతన కాలపు సనాతనవాది అనుకుంటే తప్పులో కాలేసినట్టే. 'పురాతన' వరకూ కాస్త కరక్టే – ఎందుకంటే ఆయన పురావస్తు శాఖలో ఇంజనీర్‌గా పనిచేశాడు కాబట్టి. అందువల్ల సహజంగానే ఆయన కథలన్నీ ఆ నేపథ్యంలోనే ఉండేవి. అవన్నీ తన అనుభవాల్లో నుండే వచ్చాయనే వాడాయన. నమ్మశక్యంగాని అనుభవాలవి. వాటిలో చాలావరకూ నేనెప్పుడో మర్చిపోయినా, ఇప్పటికీ గుర్తున్నది మాత్రం ఒకటుంది.

నా చిన్నప్పుడు సింధులోయ నాగరికత గురించి ఆయన చెప్పిన కబుర్లు విన్నప్పుడు అన్నిట్లాగా అదీ కట్టుకథే అనుకున్నా కాని తర్వాత 'ఏమో నిజమే కావచ్చుగా' అన్న భావం మొగ్గతొడిగింది. కాలక్రమేణా నేను చదివిన చదువులు వాటిని మరింత అనుమానాస్పదం చేశాయి. కొన్నిసార్లు అవన్నీ గాలి కబుర్లే అనిపిస్తే, కొన్నిసార్లు అది సాధ్యమయ్యే పనే అనిపించేది. ఎన్నోసార్లు తాతయ్యని "నిజం చెప్పు తాతయ్యా. నువ్వు చెప్పింది కథా, నిజంగా నిజమా?" అంటే ఆయన్నుండి ఓ చిలిపి నవ్వే సమాధానంగా వచ్చేది.

"అప్పుడే చెప్పాగా మనవడా, నమ్మితే నమ్ము. లేకుంటే లేదు" అనేవాడు కులాసాగా. ఆధారాల్లేకుండా నమ్మటానికి అదేమన్నా ఆషామాషీ కథా? ఒకరోజు మరింత ఎక్కువగా బతిమిలాడితే "నేను పోయాక నీకా రహస్యం తెలిసే ఏర్పాటు చేశాలేరా. అప్పటిదాకా దాన్నో పజిల్‌గానే మిగిలి పోనీ. అలాగైనా తాతయ్యని రోజూ గుర్తుచేసుకుంటావు" అన్నాడు బోసి నోటితో నవ్వుతూ.

★★★

కర్మకాండల హడావిడి అయిపోయాక ఎవరో భద్రంగా తెచ్చి నా చేతికందించారది. "పెద్దాయన దీన్ని మీకిమ్మని మరీ మరీ చెప్పాడు" అంటూ. మందపాటి ఫోల్డర్. తెరిచి చూస్తే లోపలన్నీ కాగితం ముక్కలు. వివిధ భాషల వార్తా పత్రికలనుండి, సైన్స్ పత్రికలనుండీ కత్తిరించినవి. వాటిలో అధికం దశాబ్దాల క్రితం నాటివి లాగున్నాయి. కొన్ని పట్టుకుంటే చిరిగిపోయేలా ఉన్నాయి. ప్రపంచంలో ఎక్కడెక్కడో పురావస్తు తవ్వకాల్లో బయటపడ్డ వింతలూ, విశేషాలూ, యూఎఫ్‌వోలు, గ్రహాంతరవాసులు, మిస్టరీలు, వగైరా వార్తల సేకరణది. జాగ్రత్తగా ఒక్కోటీ తీసి చదువుతుంటే తాతయ్య చెప్పిన చిన్ననాటి కథలకి ముడి సరుకెక్కడిదో అర్థమవసాగింది. నవ్వుకుంటూ ఒక్కోటీ తిరగేస్తుంటే నా దృష్టి నాకర్షించిందా శీర్షిక.

"సింధులోయ తవ్వకాల్లో దొరికిన పరీక్ష నాళిక".

నా గుండె వేగం హెచ్చింది. ఇన్నేళ్లుగా నేను ఎదురుచూస్తున్న ఆధారం ఇదేనా? గబగబా చదవటం మొదలుపెట్టాను.

"పందొమ్మిది వందల మూడులో ఈజిప్టు గీజా పిరమిడ్ల వద్ద దొరికిన పరీక్ష నాళికల్ని పోలిన వస్తువొకటి నెల రోజుల క్రితం సింధులోయలో జరిపిన తవ్వకాల్లో బయటపడింది. ఆరంగుళాల పొడవు, అంగుళం మందమూ ఉన్న ఈ నాళిక చిన్న పిల్లలు ఆడుకునే గిలక్కాయని పోలి ఉండటంతో అది బహుశా ఆటబొమ్మై ఉండవచ్చునని పురావస్తు శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గీజా నాళికలూ, ఇదీ ఒకే ఆకారంలో ఉండటం, వాటి తయారీలో వాడిన అజ్ఞాత పదార్థం ఒకటే కావటం. కార్బన్ డేటింగ్‌లో అవి ఖచ్చితంగా ఏ కాలానికి చెందినవో నిర్ధారించలేకపోయినా అవన్నీ ఒకే కాలానికి చెందినవిగా రుజువవ్వటం, ఇత్యాది కారణాల వల్ల ప్రాచీన ఈజిప్టు, ప్రాచీన సింధులోయ నాగరికతల మధ్య విస్తారంగా వాణిజ్యం జరిగి ఉండొచ్చని పురావస్తు శాస్త్రవేత్తలు, చరిత్రకారులు భావిస్తున్నారు"

నవ్వొచ్చింది నాకు. "హమ్మ తాతయ్యా. ఇంత బుల్లివార్త చదివి అంత పెద్ద కథ అల్లేశావా?" అనుకుంటుంటే ఆ రోజు మా ఇద్దరి మధ్యా జరిగిన ఆసక్తికరమైన సంభాషణ గుర్తొచ్చింది. ఆయన చెప్పిన ఇతర కథలన్నీ ఒకెత్తు. ఇదొక్కటీ ఒకెత్తు. అందుకే ఇప్పటికీ కళ్లముందే కదులుతుందానాటి మా సంభాషణ.

★★★

ప్రపంచాన్ని తాతయ్య చూసే విధానం భిన్నంగా ఉండేది. "పేపర్లలోనూ పుస్తకాల్లోనూ చదివేది నిజం కాదురా, కళ్లు తెరిచి నీ చుట్టూ చూడు. లోతుగా చూడు. డోన్ట్ జస్ట్ లుక్, సీ" అనేవాడు తరచూ. లుకింగ్‌కీ సీయింగ్‌కీ తేడా అప్పుడు నాకు తెలిసేది కాదు. ఓ సారి అదే మాటన్నా ఆయనతో, నేను ఇంటర్ రెండో ఏడాదిలో ఉండగాననుకుంటా.

చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి నాకేసి తిరిగాడాయన. కాసేపు దీక్షగా నన్నే చూసి మళ్లీ పుస్తకం అందుకున్నాడు. ఈజిప్టాలజీ గురించిన పుస్తకమది.

"గీజా గ్రేట్ పిరమిడ్‌లో ఎన్ని రాళ్లున్నాయో తెలుసా?" అన్నాడు పుస్తకంలోకి చూస్తూ. ఏ ప్రశ్నకీ సూటిగా సమాధానం ఇవ్వకపోవటం ఆయన స్టైల్.

"ఊహూఁ" అన్నా నేను. ఆయనెటూ చెప్పేస్తాడని తెలుసు.

"ఒక్కోటీ పాతిక టన్నులదాకా బరువుండేవి సుమారు పాతిక లక్షల రాళ్లు."

"అమ్మో. అన్నే!"

"అవును. నాలుగు వేల ఆరొందలేళ్ల కిందట... అంత పెద్ద రాళ్లని పగలగొట్టి, అంత కచ్చితంగా చెక్కి, పిరమిడ్ కట్టే చోటికి తరలించడానికి ఏం టెక్నాలజీ ఉండేదనుకున్నావు? కొండలు పేల్చటానికి డైనమైట్ లేదు. రాళ్లు తరలించటానికి క్రేన్లూ, ట్రక్కులూ లేవు. అసలు వాళ్లకప్పుడు ఇనుము కూడా తెలీదు కాబట్టి... గునపాలాంటివీ లేవన్నమాట."

"మరెలా చేశారు తాతయ్యా?" నాలో కుతూహలం.

"వాళ్ల దగ్గర టెక్నాలజీ లేకపోయినా, అదున్న వేరే వాళ్ల సహాయం తీసుకునుండొచ్చుగా"

"అంటే?"

"గ్రహాంతరవాసులు"

"వాట్?"

"అవునోయ్. పిరమిడ్స్‌ని ఏలియన్స్ కట్టుండొచ్చు కదా"

"సిల్లీ ఐడియా, కథలకి పనికొస్తుంది."

"సహేతుకమనిపించే వివరణలన్నీ అసాధ్యాలుగా తేలిపోయినప్పుడు మిగిలింది – అదెంత అసంబద్ధమైనా – సాధ్యమేనంటాడు షెర్లాక్ హోమ్స్. విపరీతమూ, మన నమ్మకాలకి విరుద్ధమూ అనిపించినంత మాత్రాన అన్ని ఐడియాలనీ కొట్టిపారేయకూడదోయ్. మనకి కనిపించనంత మాత్రాన గ్రహాంతరవాసులు లేరని చెప్పకూడదు. మనిషికి అంతుపట్టనివి చాలా ఉన్నాయీ విశ్వంలో."

"ఒప్పుకుంటా. అయితే పిరమిడ్లు కట్టింది ఏ గ్రహవాసులంటావ్?"


"ఎక్కడివారైనా కావచ్చు. లక్షలకోట్ల కాంతి సంవత్సరాల దూరంలోని ఏ మహాగ్రహవాసులో కావచ్చు. లేదా ఈ భూమ్మీది బుద్ధి జీవులూ కావచ్చు."

"కమాన్ తాతయ్యా. మరీ నా చెవిలో పూలు పెట్టేస్తున్నావ్. ఈజిప్షియన్లకి లేని టెక్నాలజీ అదే కాలంలో భూమ్మీద వేరే సివిలైజేషన్లలో ఉండంటావా?"

"అదే కాలం అని నేనన్నానా? వేరే కాలంలో విరాజిల్లిన సివిలైజేషన్. భవిష్యత్తు తరాల వాళ్లన్న మాట."

"వాట్?"

**ఆధారాల్లేకుండా నమ్మటానికి అదేమన్నా ఆషామాషీ కథా? ఒకరోజు మరింత ఎక్కువగా బతిమిలాడితే "నేను పోయాక నీకా రహస్యం తెలిసే ఏర్పాటు చేశాలేరా. అప్పటిదాకా దాన్నో పజిల్‌గానే మిగిలి పోనీ. అలాగైనా తాతయ్యని రోజూ గుర్తుచేసుకుంటావు" అన్నాడు బోసి నోటితో నవ్వుతూ.**



"టైమ్ ట్రావెల్ గురించెప్పుడూ వినలేదా మనవడా? భవిష్యత్తులో మానవజాతి సాంకేతికత కాల ప్రయాణాలు చెయ్యగలిగే స్థాయిలో అభివృద్ధి చెందొచ్చు. వాళ్లు గతంలోకెళ్లి టెక్నాలజీ వాడి పిరమిడ్ల నిర్మాణానికి సహాయం చేసుండొచ్చు."

"నాన్సెన్స్ తాతయ్యా. నువ్వు కథలు చెబుతున్నావు."

"సరే. అయితే దీనికి సమాధానం చెప్పు. పిరమిడ్ల నిర్మాణంలో వాడిన మోర్టార్ – అంటే సిమెంట్‌లాంటి జిగురు పదార్థం – ఉంది చూశావూ, పిరమిడ్లు అన్ని వేల ఏళ్లు చెక్కు చెదరకుండా ఉన్నాయంటే ఆ మోర్టారే కారణం. ఇప్పుడు మనం వాడే సిమెంట్లన్నీ దాని గట్టిదనమ్ముందు బలాదూర్. ఆ మోర్టార్ రసాయన సమ్మేళనం నేటి శాస్త్రవేత్తలు డీకోడ్ చెయ్యగలిగారు. కాని దాన్ని తయారుచేసే పద్ధతి మాత్రం కనుక్కోలేకపోయారు. ఇంత టెక్నాలజీతో ఇప్పుడే చెయ్యలేని పని అప్పట్లో ఎలా చెయ్యగలిగారంటావ్? వాళ్లకి ఎవరో సహాయం చేసుండాలి అనిపించట్లా?"

"గ్రహాంతరవాసులా లేక టైమ్ ట్రావెలర్సా?"

"ఎవరైనా కావచ్చు. అది నీ ఊహకే వదిలేస్తున్నా. ఒకవేళ అది టైమ్ ట్రావెలర్స్ పనే అయితే, ఒక తమాషా జరిగే అవకాశముంది."

"తమాషానా ... ఏంటది?"

"పిరమిడ్లలో వాడిన మోర్టార్ మీద పరిశోధనలు చేసి వచ్చే యాభయ్యేళ్లలో దాన్నెలా తయారుచెయ్యాలో మన సైంటిస్టులు కనిపెట్టేస్తారనుకుందాం. అదే సమయానికి మరో సైంటిస్టు టైమ్ మెషీనొకటి తయారు చేశాడనుకుందాం. మన మోర్టార్ సైంటిస్టులు, ఆ మోర్టార్ గట్టిదనం ఎంతో పరీక్షించాలనుకుని, టైమ్ మెషీనేసుకుని నాలుగు వేల ఆరొందల సంవత్సరాల వెనక్కెళ్లి ప్రాచీన ఈజిప్షియన్లకి మోర్టార్ తయారు చెయ్యటం నేర్పించి వచ్చారనుకుందాం. తమాషాగా లేదూ?"

"తమాషా ఏమో కానీ, తికమకగా ఉంది."

"ఏమిటా తికమక?"

"పిరమిడ్లలో వాడిన మోర్టార్ మనవాళ్లు రివర్స్ ఇంజనీరింగ్ చేసి దాని ఫార్ములా కనుక్కొని, గతంలోకెళ్లి ప్రాచీన ఈజిప్షియన్లకి మోర్టార్ తయారుచెయ్యటం నేర్పించారు అంటే – మనవాళ్లు నేర్పించకపోతే ఈజిప్షియన్స్ మోర్టార్ తయారుచెయ్యగలిగేవాళ్లు కాదు కదా. ఈజిప్షియన్స్ తయారు చెయ్యకపోతే మనవాళ్లు దాన్ని రివర్స్ ఇంజనీరింగ్ చెయ్యగలిగేవాళ్లు కాదు కదా. అప్పుడు అది చేసే పద్ధతి ఎవరు ముందు కనిపెట్టినట్లు? వాళ్లా లేక వీళ్లా?"

"గుడ్ క్యాచ్. పట్టుకుంటావో లేదో అనుకున్నా. గుడ్డు ముందా, పిల్ల ముందా లాంటి తిరకాసన్న మాట. దీన్నే క్యాజువాలిటీ పారడాక్స్ అంటారు. టైమ్ ట్రావెల్‌లో ఇలాంటి తిరకాసులు ఇంకా ఉన్నాయి. ఇంటరెస్టింగ్‌గా లేదూ?"

ఈ తిరకాసుల వ్యవహారమేదో నాకు సరదాగా అనిపించింది. టైమ్ ట్రావెల్ పట్ల నా ఆసక్తికి అదే నాంది.

"ఇదంతా బాగానే ఉంది కానీ, అసలు టైమ్‌ట్రావెల్ అనేది కుదిరే పనేనా?" ఉత్సాహంగా అడిగాను.

"ఎందుక్కాదురా. రెండొందలేళ్ల క్రితం గాల్లో ప్రయాణం కుదిరే పని అనుకున్నారా ఎవరన్నా? వందేళ్ల క్రితం రోదసిలో కెళ్లటం కుదిరే పని అనుకున్నారా? అవన్నీ సాధ్యమైనట్లే ఇదీ సాధ్యమవుతుంది ఏదో నాటికి."

"ఏమో నాకు నమ్మకం లేదు."

తాతయ్య ముందుకొంగాడు. అటూ ఇటూ చూసి మెల్లగా "నీకో రహస్యం చెప్పనా? ఎవరికీ చెప్పకూడదు" అన్నాడు. నేను సరేనన్నాక గుసగుసగా చెప్పాడు. "నేనూ ఓసారి టైమ్ ట్రావెల్ చేశానోయ్. అందుకే అంత నమ్మకంగా చెబుతున్నా."

**"గ్రహాంతరవాసులా లేక టైమ్ ట్రావెలర్సా?"**
**"ఎవరైనా కావచ్చు. అది నీ ఊహకే వదిలేస్తున్నా. ఒకవేళ అది టైమ్ ట్రావెలర్స్ పనే అయితే, ఒక తమాషా జరిగే అవకాశముంది."**
**"తమాషానా ... ఏంటది?"**

పగలబడి నవ్వేశాను. "కొయ్యమాకు తాతయ్యా. నీకన్నీ పరాచికాలే. అసలు టైమ్ మెషీన్ ఎక్కడిది నీకు? అంత పెద్దది ఎవరికీ తెలీకుండా ఎలా తయారు చేశావు?"


"టైమ్ మెషీన్ పెద్దగానే ఉండాలని ఎవరు చెప్పారోయ్ నీకు? అసలది యంత్రం కావాల్సిన అవసరమూ లేదు."

"మరి?"

"సింగ్యులారిటీ అంటే ఏంటో తెలుసా నీకు?"

"బ్లాక్ హోల్ కేంద్రంలో ఉండే పరిస్థితేగా? అణుబాంబులు పని చేసేది కూడా ఈ సింగ్యులారిటీ ఆధారంగానే కదా" ఫిజిక్స్ పాఠాలు గుర్తుచేసుకుంటూ చెప్పాను.

"యస్. భారీ నక్షత్రాలు పేలిపోవటాన్ని సూపర్‌నోవా అంటారు. సూపర్‌నోవా కేంద్రస్థానంలో సూక్ష్మ పరిమాణంలో ఉండే పదార్థాన్ని డార్క్ మ్యాటర్ అంటారు. ఆ డార్క్ మ్యాటర్ చుట్టూ ఆవరించి ఉండేదే సింగ్యులారిటీ. సింగ్యులారిటీ గాఢత కొంత తగ్గించి బ్లాక్ హోల్ బదులు మైక్రోస్కోపిక్ వర్మ్‌హోల్ – అంటే అతి సూక్ష్మమైన కాలబిలం – ఒకటి సృష్టిస్తే దాని ద్వారా కాలంలో ముందుకీ వెనక్కీ ప్రయాణించొచ్చు.



ఐన్‌స్టీన్ సాధారణ సాపేక్ష సిద్ధాంతం చెప్పే విషయమే ఇది."

"ఓకే...ఐతే ఏంటట?"

"పందొమ్మిదొందల యాభైల్లో నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో ఫీల్డ్‌వర్క్ కోసం ఈజిప్ట్ వెళ్లానా? అక్కడ పిరమిడ్లలో నాక్కొన్ని సీల్డ్ టెస్ట్ ట్యూబ్స్ లాంటివి దొరికాయి. ఏదో వింత పదార్థంతో తయారు చేసినట్లున్నాయి. ప్రాచీన కాలంలో పిల్లలాడుకునే గిలక్కాయల్లాంటివి కావచ్చు. న్యాయంగా అయితే అవన్నీ ఈజిప్షియన్ ప్రభుత్వానికి అప్పగించాలి. ఆసక్తి కొద్దీ వాటిలో ఒకటి దొంగతనం చేసి ఇండియా తీసుకొచ్చి నా స్నేహితుడు ఫిజిక్స్ ప్రొఫెసర్ ఒకడుంటే వాడికిచ్చా, దాన్ని తయారుచేసిన మెటీరియల్ కనుక్కోమని. వాడు దాని మీదేవో ప్రయోగాలు, పరిశోధనలు చేస్తే మేం ఊహించనిదొకటి బయటపడింది."

"లెట్ మి గెస్ ... ఆ మెటీరియల్ వేరే గ్రహమ్మీదది అనే కదా. రైటేనా?"

"రాంగ్. ఆ పరీక్ష నాళికలో అణుమాత్రంగా మిగిలున్న డార్క్ మ్యాటర్. అదెక్కడి నుండొచ్చిందీ తెలీదు కానీ, సరిగా వాడితే దానితో వర్మ్‌హోల్స్ సృష్టించొచ్చు. కాలంలో ప్రయాణాలూ చెయ్యొచ్చు."

"అంటే, కాలప్రయాణీకులెవరో దాన్ని పిరమిడ్లలో పోగొట్టుకుంటే మీకు దొరికిందన్న మాట."

"ఎక్జాక్ట్‌లీ. దాన్ని వాడే మేము టైమ్ ట్రావెల్ చేశాం. నేనూ, నా స్నేహితుడూ."

తాతయ్య చెపుతున్నదంతా కట్టుకథేనని తెలుసు. ఓ పక్క నవ్వొస్తోంది. ఐనా ఆయన ముందు ముందు ఏం చెప్పబోతున్నాడో అన్న ఆసక్తీ ఉంది. అందుకే నవ్వాపుకుంటూ అన్నా.

"ఇంట్రెస్టింగ్ తాతయ్యా. ఎక్కడికెళ్లారేంటి కాలంలో?"

"సింధులోయకి. ఇండస్‌వ్యాలీ సివిలైజేషన్

వర్ధిల్లుతున్న రోజులకి.''

''అప్పటికే ఎందుకు?''

''ఆ నాగరికత ఎందుకు అంతరించిపోయిందో చెప్పు చూద్దాం.''

''ఆర్యుల దండయాత్రలనీ, సింధు నది వరదలనీ, ఘగర్ – హక్రా నది దిశ మార్చుకోటం వల్లనీ, భూకంపాల నుండనీ ... రకరకాల కారణాలు చెబుతారు. ఏది నిజమో మరి.''

''మిగతావన్నీ ఈ మధ్య – ఇరవై ముప్పై ఏళ్ల కిందట ప్రతిపాదించిన సిద్ధాంతాలు. పందొమ్మిదొందల యాభై మూడు ప్రాంతంలో మన వాళ్లకి తెలిసింది ఆర్యుల దండయాత్ర సిద్ధాంతం ఒకటే. అదెంతవరకూ నిజమో కనుక్కుందామనే మేం ఆ కాలానికెళ్లాం.''

నాకు ఆసక్తి పెరిగింది. కథ వినటంలో లీనమైపోయానిక.

''వర్మ్‌హోల్ గుండా వెనక్కి ప్రయాణించి క్రీస్తు పూర్వం పదిహేను వందల ఏళ్ల ప్రాంతానికి వెళ్లాం. సింధులోయ నాగరికత వెలుగులు చూసి అదిరిపోయాం. సింధునది, దానికి సమాంతరంగా ఘగర్ – హక్రా నది. ఆహా... ఏం నదుల్రా అవి! మన కృష్ణా, గోదావరీ వాటి ముందు పిల్లకాలవలే. ఆ రెండు నదుల మధ్యలో వందలాది పట్టణాలు, పల్లెలు. అప్పట్లోనే కొన్ని నగరాల్లో యాభై అరవై వేలకి తగ్గని జనాభా. ఆ నగరాలు, వాటి ప్లానింగ్ చూసి తీరాల్సిందే. ఆ నాటి ఇంజనీర్ల గురించి నేటి చరిత్రకారులు గొప్పగా చెబుతుంటారు కానీ, నిజానికి వాళ్ల గొప్పదనంలో మనమెరిగింది పది శాతమే. సిటీ ప్లానింగ్ అంటే వాళ్లనుండే నేర్చుకోవాలి. అన్నిట్లోకీ చెప్పాల్సింది సింధు నదిపై వాళ్లు కడుతున్న బ్రహ్మాండమైన ఆనకట్ట గురించి. అసలు గ్రేట్ పిరమిడ్ ఎందుకు పనికొస్తుంది దాని ముందు. ఆ కాలంలోనే అంత భారీ కట్టడం! మన దేశంలో ఇప్పుడున్న డ్యామ్స్ అన్నీ దానిముందు దిగదుడుపే...'' తాతయ్య పరవశంగా చెప్పుకుపోతున్నాడు. ఆ తన్మయత్వం చూస్తే ఆయన నిజంగానే అవన్నీ చూశాడా అన్న అనుమానమొచ్చింది నాకు. ఆయన్ని ఆపకపోతే ఆగేలా లేడు.

''ఆగు తాతయ్యా. సింధు నాగరికతలో భారీ ఆనకట్టలేవీ ఉన్నట్లు వినలేదే'' అన్నాను ఆయన వాక్ – ప్రవాహాన్నాపుతూ.

''ప్రశ్నలెయ్యకుండా విను. దానికీ సమాధానం చెబుతాగా'' అని కోరగా నాకేసి చూసి కొనసాగించాడాయన. ''సింధులోయలో చివరి మజిలీగా ఆ డ్యామ్ వద్ద ఆగాం. దాని భారీ పరిమాణానికీ; క్రేన్లూ, ప్రొక్లయిన్లూ లాంటివి లేకుండానే దాన్ని కడుతూన్న వాళ్ల నైపుణ్యానికి ఆశ్చర్యపోయాం. ఇక తిరిగొచ్చేసే సమయమయింది. అయితే అర్థం కాని విషయం మాత్రం ఒకటి అలాగే మిగిలిపోయింది.''

''ఏంటది?''

''మన లెక్కల ప్రకారం మేం వెళ్లేటప్పటికే ఆ నాగరికత అవసాన దశలో ఉండాలి. కానీ అలాంటి సూచనలేవీ కనపడలేదక్కడ. ఆర్యుల ఆనవాళ్లు లేవు. దండయాత్రల దాఖలాలూ లేవు. మొత్తానికి, మేం ఏ నిజం కనుక్కుందామని వెళ్లామో అది మాత్రం మాకు తెలియలా. నిరాశగా వెనక్కి తిరిగి వచ్చేయబోతుండగా జరిగిందది. మేం ఏ మాత్రమూ ఊహించనిది.''

''ఏం జరిగింది?'' నాలో ఉత్సుకత.

''తిరుగు ప్రయాణం నిమిత్తం వర్మ్‌హోల్ సృష్టించే ప్రయత్నంలో మా వాడు గందరగోళానికి గురై దానిమీద నియంత్రణ కోల్పోయాడు. అవసరమైనదానికన్నా ఎక్కువ శక్తివంతమైన వర్మ్‌హోల్ చేసేశాడు. దానిగుండా మేమైతే ఎలాగోలా మా కాలంలోకి తిరిగి రాగలిగాం కానీ, మేమిలా దాటేశామో లేదో దాని వల్ల అక్కడో చిన్నపాటి అణువిస్ఫోటనం జరిగింది. దాని దెబ్బకి ఆనకట్ట తునాతునకలైపోయింది. జలాశయం నుండి ఒక్కుదుటన విడుదలైన నీరు వంద సునామీల పెట్టున సింధునది పొడుగునా ఉన్న నగరాలనీ, గ్రామాలనీ ముంచెత్తింది.''

**''మన లెక్కల ప్రకారం మేం వెళ్లేటప్పటికే ఆ నాగరికత అవసాన దశలో ఉండాలి. కానీ అలాంటి సూచనలేవీ కనపడలేదక్కడ. ఆర్యుల ఆనవాళ్లు లేవు. దండయాత్రల దాఖలాలూ లేవు. మొత్తానికి, మేం ఏ నిజం కనుక్కుందామని వెళ్లామో అది మాత్రం మాకు తెలియలా. నిరాశగా వెనక్కి తిరిగి వచ్చేయబోతుండగా జరిగిందది. మేం ఏ మాత్రమూ ఊహించనిది.''**

''వ్వాట్ట్?'' అదిరిపడ్డాన్నేను. ఇది నేనూహించని ట్విస్టు.


''అంతేకాదు. ఆ విస్ఫోటనం ధాటికి ఒకదాని వెంబడి ఒకటి చైన్ రియాక్షన్‌లా భూకంపాలు విరుచుకుపడి ఆ ప్రాంతాన్నంతా కుదిపేశాయి. వాటి దెబ్బకి ఘగర్ – హక్రా నది ఉన్న పళాన దిశ మార్చేసుకుంది. కాలబిలంలో కూర్చుని వెనక జరుగుతున్న వినాశనం, విధ్వంసం చూస్తూ మేం చెప్పలేనంత షాక్‌కి గురయ్యాం.''

★★★

''ఇప్పుడర్థమయిందా, సింధు లోయ నాగరికత ఎలా అంతరించిందో?'' అడిగాడు తాతయ్య.

''పూర్తిగా. మా తాతయ్యా, ఆయన ఫ్రెండూ వెళ్లి నాశనం చేశారు. మీరు వెళ్లకపోతే అది నాశనమయ్యేది కాదు. నాశనమవకపోతే మీరు వెళ్లేవారు కాదు. క్యాజువాలిటీ పారడాక్స్ అన్నమాట. మొత్తానికి ఆర్యుల దండయాత్ర వల్ల మాత్రం అంతరించలేదంటారు.''

''ఆర్యుల దండయాత్రా ఓ కారణమేనోయ్. నిజానికి అదే అసలు కారణం. ఆ ఆర్యులెవరో



కాదు – మేమిద్దరమే'' తాతయ్య కన్నుగీటి చెప్పాడు. ''అదీ సంగతి. మేం వెళ్లే నాటికి లేని భూకంపాలు, వరదల సిద్ధాంతం ఆ తర్వాత పుట్టుకు రావటానికి కారణమూ అదే. ఎవరికీ చెప్పొద్దీ విషయం. ఇది మనిద్దరి రహస్యం.''

''చెప్పినా ఎవరు నమ్ముతారు? నా ముఖాన నవ్వుతారు'' అనుకుంటూ చివరిగా ఓ ప్రశ్నడిగా. ''ఎవరికీ చెప్పన్లే కానీ, మరి మీరు మళ్లీ వెనక్కెళ్లి ఆ ఘోరం జరక్కుండా ఆపుండొచ్చు కదా.''

ఆయన గాఢంగా నిట్టూర్చి శూన్యంలోకి చూస్తూ చెప్పాడు. ''ఎలా వెళ్తాం? ఆ గందరగోళంలో డార్క్ మ్యాటర్ ఉన్న నాళిక అక్కడే పోగొట్టుకుని వచ్చాంగా.''

★★★

చిన్న వార్త ఆధారంగా చిలవలు పలవలుగా కథలల్లేసిన తాతయ్య ఊహాశక్తికి ఆశ్చర్యపోతూ ఆ పేపర్ కటింగ్‌ని భద్రంగా మడత పెట్టసాగాను. నిజం ఏమిటో తెలిసిపోయే సరికి ఉసూరుమనిపించింది. కొన్ని నిజాలు నమ్మటం కష్టం. ముఖ్యంగా – అవి ఇంత సాదాసీదాగా ఉంటాయని తెలిస్తే తాతయ్య టైమ్ ట్రావెల్ కథ నిజమే అయ్యుండాలని లోలోపలెక్కడో గట్టిగా కోరుకున్నానా నేను?

అంతలో నా దృష్టి యధాలాపంగా ఆ పేపరు ముక్కకి వెనకున్న సినిమా ప్రకటన మీద పడింది. హాలీవుడ్ సినిమా 'మమ్మీ రిటర్న్స్' ప్రకటన.

నా భృకుటి ముడిపడింది.

'ఆర్కియాలజీ' మేగజైన్‌లో నుండి సేకరించిన కాగితం అది. ఆ పత్రికలో 'మమ్మీ','ఇండియానా జోన్స్' లాంటి సినిమాల ప్రకటనలు రావటం మామూలే. అది కాదు నేను ఆలోచిస్తుంది.

మమ్మీ రిటర్న్స్ విడుదలయింది ఎనిమిదేళ్ల క్రితం. తాతయ్య నాకా కథ చెప్పి ఇరవయ్యేళ్లపైమాటే.

అంటే...!?

anil.s.royal@gmail.com